మైనర్ల వయోపరిమితిని 16 ఏళ్లకు తగ్గించాలి

విశ్వంభర, నేషనల్ బ్యూరో : నేరాలకు పాల్పడే మైనర్లకు (జువైనల్స్) సంబంధించిన చట్టాల్లో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని కేరళ హైకోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుతం పిల్లలు 16 ఏళ్ల వయసుకే తగినంత పరిణతి (మెచ్యూరిటీ) సాధిస్తున్నారని పేర్కొంది. ఈ క్రమంలో చట్టంతో విభేదించే బాలల వయసు పరిమితిని 16 ఏళ్లకు తగ్గించేలా చట్టసభలు తగిన సవరణలు చేయాలని సూచించింది. ఈ క్రమంలోనే మైనర్ల వయసు పరిమితి 18 నుంచి 16 ఏళ్లకు తగ్గించే అంశాన్ని చట్టసభలు పరిశీలించాలని తెలిపింది.మద్యం విక్రయాలు, సరఫరా, వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కొల్లంకు చెందిన వినోద్ విక్రమన్ పిళ్లై దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. 23 ఏళ్ల లోపు వారికి మద్యం విక్రయించకుండా, సరఫరా చేయకుండా చర్యలు తీసుకోవాలని, అలాంటి వారు మద్యం సేవించడాన్ని కూడా అరికట్టాలని పిటిషనర్ కోరగా జస్టిస్ ఏ. భదరుద్దీన్ పై వ్యాఖ్యలు చేశారు.

మద్యం మత్తులో రోడ్డు ప్రమాదం..

ఇటీవల నెడుంబస్సేరిలో జరిగిన ఒక ఘోర రోడ్డు ప్రమాదాన్ని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఆ ఘటనలో 18 ఏళ్ల ఓ యువకుడు మద్యం మత్తులో తన మినీ కూపర్ కారుతో స్కూటర్‌ను ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఇక ప్రమాదానికి సంబంధించి ఇప్పటివరకు జరిగిన దర్యాప్తులో ఘటనకు ముందు నిందితుడికి ఎర్నాకులంలోని పలు బార్లలో మద్యం అందించినట్లు తేలింది. దీనికి సంబంధించి అబ్కారీ చట్టం కింద ఎక్సైజ్ శాఖ ఇప్పటికే మూడు బార్లపై కేసులు కూడా నమోదు చేసింది. ఈ నేపథ్యంలోనే కేసులో ప్రధాన నిందితుడైన సుహైల్ సజీవ్‌కు మద్యం సరఫరా చేశారన్న ఆరోపణలపై మూడు బార్ల మేనేజింగ్ డైరెక్టర్లను పిటిషనర్ ఈ కేసులో ప్రతివాదులుగా చేర్చారు. వీరితో పాటు రాష్ట్ర ప్రభుత్వం, విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ బ్యూరో డైరెక్టర్, ఎక్సైజ్ కమిషనర్‌లను కూడా ప్రతివాదులుగా పేర్కొనడం గమనార్హం. ఇక్కడ కేరళ అబ్కారీ యాక్ట్, 1077లోని సెక్షన్ 15ఎ, 15బి లను పాటించలేదని పిటిషన్‌లో ఆరోపించారు. ఈ సెక్షన్ల ప్రకారం 23 ఏళ్ల లోపు వారికి మద్యం అందకుండా చూడాల్సిన బాధ్యత ఎక్సైజ్ అధికారులపై, లైసెన్స్ పొందిన బార్ యజమానులపై ఉందని తెలిపారు. లైసెన్స్ పొందిన ప్రాంగణాలలో మైనర్లకు విరివిగా మద్యం అందించడం ఆ విధిని నిర్లక్ష్యం చేయడమేనని పిటిషనర్ తరపున న్యాయవాది జయకృష్ణన్ వాదించారు. ఈ పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం 16 ఏళ్ల వయసుకే పిల్లల్లో అవగాహన, పరిపక్వత పెరుగుతోందని, ఎన్నో మార్పులు కనిపిస్తున్నాయని అభిప్రాయపడింది. ప్రస్తుత పిల్లలు, జువైనల్స్‌కు సంబంధించిన నిబంధనల్లో తగిన సవరణలు చేయాల్సిన సమయం వచ్చిందని పేర్కొంది. వారి వయసు పరిమితిని 16 ఏళ్లకు తగ్గించేలా చట్టాల్లో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పింది.

ఎక్సైజ్ కమిషనర్‌కు ఆదేశాలు..

మద్యం మత్తులో జరిగే ప్రమాదాల నుంచి ప్రజల్ని రక్షించడానికి 'కేరళ అబ్కారీ చట్టం' నిబంధనలు సమర్థంగా అమలవుతున్నాయా లేదా అంశంపైనా హైకోర్టు దృష్టిసారించింది. ప్రజల భద్రతకు ముప్పు కలగకుండా మద్యం విక్రయాలు, సరఫరాపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో వివరించాలని, నిబంధనల్ని మరింత కఠినంగా అమలు చేయాలని కోర్టు ఈ సందర్భంగా ఎక్సైజ్ కమిషనర్‌ను ఆదేశించింది. ఈ చట్టం అమలు కోసం జారీ చేసిన ఆదేశాలు, వాటిని మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి సూచనలతో కూడిన నివేదికను కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను కేరళ హైకోర్టు నవంబర్ 24వ తేదీకి వాయిదా వేసింది.

సమస్యలు పరిష్కరించాలని 25, 26 తేదీలలో

కోర్టు గేటు ముందు ధర్నాలు



విశ్వంభర, హైదరాబాద్ : రాష్ట్రంలో న్యాయవాదుల సమస్యలు, ఈ ఫైలింగ్ సమస్య పరిష్కారం కోరుతూ ఈనెల నవంబర్ 25, 26 తేదీలలో రాష్ట్రంలోని అన్ని కోర్టుల గేటు ముందు ధర్నాను నిర్వహించి జిల్లా జడ్జి, బార్ అసోసియేషన్ ప్రతినిధుల ద్వారా హైకోర్టు కోర్టుకు మెమోరాండం సమర్పించాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్ణయించింది. హైదరాబాదులోని అమృత ఎస్టేట్లో ఐఏఎల్ రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షతన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రధానంగా న్యాయవాదులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, అందులో ముఖ్యంగా కేసులను" ఈ ఫైలింగ్" పద్ధతి ద్వారా ఫైల్ చేయాలనే విధానం న్యాయవాదులు ఒత్తిడికి గురయ్యేలా చేస్తుందన్నారు. ఈ సమస్యపై ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఐఏ ఎల్ ఆధ్వర్యంలో గతంలో బార్ కౌన్సిల్ చైర్మన్ ,వైస్ చైర్మన్ , హైకోర్టు రిజిస్టర్ దృష్టికి తీసుకురావడం జరిగింది అన్నారు. ఫలితంగా మూడు నెలల గడువు తో వెసులు బాటను ఇచ్చారు కానీ, కోర్టులలో మౌలిక వసతులు లేకపోవటం వలన, న్యాయవాదుల ఆఫీసులలో, కోర్టులలో, కంప్యూటర్ లేకపోవటం వలన ఈ ఫైలింగ్ పద్ధతిలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి అన్నారు. మృతి చెందిన న్యాయవాదులకు కంపన్షేషన్ కింద 25 లక్షలు ఇవ్వాలని, సీనియర్ న్యాయవాదులకు పెన్షన్ 15000/ఇవ్వాలని, జూనియర్ న్యాయ వాదులకు బ్యాంకు లోన్లు , గృహ వసతులు, స్కాలర్‌షిప్ ఇవ్వాలని, మహిళ న్యాయ వాదులకు కోర్టులలో ప్రత్యేక మౌలిక సదుపాయాలను కల్పించాలని అని అన్నారు. సమావేశంలో వివిధ జిల్లాలకు సంబంధించిన ఐ ఏ ఎల్ నాయకులు డి. జయ శ్రీనివాస్. ఓరుగంటి శేషగిరి రావు, భగత్ సేన్, రాము, భూపాల్ రెడ్డి, నరసింహారావు, భీమార్జున్ రెడ్డి ,గూగులోతు రాజారాం,ఎస్ నాగేశ్వరరావు, కృష్ణ, సునీల్, వెంకటేష్ వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



విశ్వంభర, సరూర్ నగర్ : బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సరూర్‌నగర్‌లోని వీఎం హోంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హోం సెక్రటరీ సల్మా భాను, ప్రిన్సిపాల్ కుర్షిద్ పాషా, సూపరింటెండెంట్ లక్ష్మీపార్వతి తదితరులు పాల్గొన్నారు.

మూన్‌వాకర్ డ్యాన్స్ స్టూడియోలో బాలల దినోత్సవం

విశ్వంభర , సరూర్ నగర్ : సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని మున్సిపల్ రోడ్డు మార్గంలో, వీఎం సమీపంలోని మూన్‌వాకర్ డ్యాన్స్ స్టూడియో (ఎండబ్ల్యూడీఎస్)లో శనివారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్టూడియో వ్యవస్థాపకుడు, ప్రముఖ డాన్స్ మాస్టర్ చక్రీ జాక్సన్‌ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో స్టూడియోలో డ్యాన్స్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తమ నత్య ప్రదర్శనలతో సందడి చేశారు.



తుది దశకు భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం

విశ్వంభర, నేషనల్ బ్యూరో: భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం గురించి విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాల మధ్య ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందానికి సంబంధించి సుంకాలతో సహా చాలా సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. మిగిలిన కొన్ని అంశాలపై చర్చలు కొనసాగుతున్నాయని వివరించారు. త్వరలోనే ఈ ఒప్పందం ఖరారు కావొచ్చని వెల్లడించారు. వాణిజ్య ఒప్పందం చర్చలు తుది దశకు చేరుకున్నాయని స్పష్టం చేశారు. మిగిలిన సమస్యలలో చాలా వరకు మన వైపు ఉన్నవి కావని, అమెరికా వైపు నుంచే ఎక్కువ మార్పులు జరగాల్సి ఉందని చెప్పారు. 'హెచ్‌టీ లీడర్‌షిప్ సమ్మిట్'లో జరిగిన ఒక చర్చా కార్యక్రమంలో పాల్గొన్న జైశంకర్ ఈ మేరకు మాట్లాడారు.



'ఈ ట్రేడ్ డీల్ వల్ల భారత్‌కు కొంత అదనపు ప్రయోజం ఉండాలి'..

"వాణిజ్య ఒప్పంద చర్చలు తుది దశకు చేరుకున్నాయి. మిగిలిన సమస్యలలో చాలా వరకు మన వైపు ఉన్నవి కావు. అవి అమెరికా వైపు నుంచే ఎక్కువ మార్పులు జరగాల్సి ఉంది. భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం తుది దశలో ఉంది. ఇది రహస్యమేమీ కాదు. ఒప్పందం చివరి దశలో అందరూ కొంత అసహనంతో ఉండటం సహజమే. భారత్‌కు కావాల్సింది ప్రయోజనకరమైన, సమతుల్యమైన వాణిజ్య ఒప్పందం. ఇది ఇతర సమాన ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే మాకు కొంత అదనపు ప్రయోజనాన్ని కల్పించేలా ఉండాలి. మేము ఆశిస్తున్నది ఇదే. వాణిజ్య ఒప్పందం పూర్తయ్యే సమయానికి అటువంటి స్థితిని చేరుకోవాలనేది మా ఆకాంక్ష. ఈ ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందాన్ని రెండు దేశాల దృష్ట్యా మరింత విస్తృత కోణంలో చూడాలి" అని జైశంకర్ స్పష్టం చేశారు.

గతంలో ఆసియా దేశాలతో భారత్ కొన్ని వాణిజ్య ఒప్పందాలు చేసుకుందని జైశంకర్ తెలిపారు. వాటిలో చాలా దేశాలు భారత్‌కు గట్టి పోటీనిచ్చే ఆర్థిక వ్యవస్థలేనని అభిప్రాయపడ్డారు. ఆ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ద్వారా ఆశించిన ప్రయోజనాలు తమకు దక్కలేదని అసహనం వ్యక్తం చేశారు. కానీ గత కొన్నేళ్లుగా ఇండియా కుదుర్చుకున్న ఒప్పందాలను గమనిస్తే, అవి చాలా లోతుగా ఆలోచించి, వ్యూహాత్మకంగా, ఆర్థిక కోణంలో సమగ్రంగా అంచనా వేసిన తర్వాతే రూపొందించినవి తన అభిప్రాయమని చెప్పారు. భారత్‌కు అమెరికా అతిపెద్ద మార్కెట్ అని, ఆ దేశంతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడం ఇండియాకు ఎంతో ప్రయోజకరమని అన్నారు.

అమెరికాతో ఒప్పందం వల్ల భారత్‌కు మేలు : జైశంకర్..

"ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన అమెరికా భారత్‌కు అతిపెద్ద మార్కెట్‌గా ఉంది. కాబట్టి అటువంటి దేశంతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడం భారత్‌కు కచ్చితంగా ప్రయోజనకరమే. అమెరికా విషయానికి వస్తే అధ్యక్షుడు ట్రంప్ తమ దేశ మార్కెట్లను మెరుగుపరచుకోవడానికి అనేక ద్వైపాక్షిక ఒప్పందాలను కుదుర్చుకోవాలని చూస్తున్నారు. ఇప్పుడు అసలు సవాల్ ఏమిటంటే ఇరు పక్షాలకు ఆమోదయోగ్యమైన ఒక మధ్యేమార్గాన్ని కనుగొనడం. ఇది ఏదో అద్భుతంలా, కేవలం సాహసోపేతమైన ఆలోచనలతో లేదా వేగవంతమైన చర్యలతో వెంటనే పూర్తయ్యే పని కాదు. ఎందుకంటే వీటిపైనే ప్రజల ఉపాధి, జీవనోపాధి అపకాశాలు ముడిపడి ఉన్నాయి"అని జైశంకర్ పేర్కొన్నారు.

చైనా బార్డర్‌పై కీలక వ్యాఖ్యలు..

మరోవైపు, చైనాతో భారత్ సరిహద్దు పంచుకోవడంపైనా జైశంకర్ స్పందించారు. చైనాతో భారత్ సరిహద్దు మరింత క్రియాశీలంగా మారిందన్నారు. అందుకే అక్కడ నిరంతరం భారీ సంఖ్యలో సైన్యాన్ని మోహరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. సరిహద్దు వెంబడి మౌలిక సదుపాయాలను పెంచడానికి న్యూదిల్లీ అనుసరిస్తున్న విధానాన్ని వివరించారు. 2020లో తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణల తర్వాత ఎల్ఏసీ వెంబడి భారత్ తన సైనిక సామర్థ్యాలను బలోపేతం చేసిందన్నారు. ప్రస్తుతం చైనాతో సరిహద్దు ఒక విధంగా మరింత ఉద్రిక్తంగా మారిందని అభిప్రాయపడ్డారు.

"భారత్, చైనాల మధ్య ఉన్న ఆర్థిక అసమానతల గురించి అడిగిన ప్రశ్నకు జైశంకర్ సమాధానమిచ్చారు. "1960, 70, 80వ దశకాల్లో ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామికీకరణ జరిగింది. అప్పట్లో అభివృద్ధి చెందుతున్న దేశాలు పారిశ్రామికీకరణ వైపు అడుగులు వేశాయి. 1988లో రాజీవ్ గాంధీ చైనాను సందర్శించిన సమయంలో భారత్, చైనా ఆర్థిక వ్యవస్థలు సమానంగానే ఉండేవి. కానీ 1980వ దశకంలో చైనా ఆధునీకరణ, పారిశ్రామికీకరణ దిశగా భారీ ప్రయత్నాలు చేసింది. దురదృష్టవశాత్తూ, 1980వ దశకంలో భారత్ ఆ అవకాశాన్ని కోల్పోయింది. 1990వ దశకంలో మనం కొన్ని సవరణలు, సంస్కరణలు చేపట్టాం. కానీ ఆ సంస్కరణలను ప్రతి రంగానికి విస్తరిస్తూ, నిరంతరం అభివృద్ధిని కొనసాగించడంలో వెనుకబడిపోయాం" అని జైశంకర్ వివరించారు.

ఘనంగా 'ఈఎన్ఈ డే'..

తరుణ్ భాస్కర్, చిత్రబృందంతో అభిమానుల సందడి

విశ్వంభర, హైదరాబాద్: ఎనిమిదేళ్లుగా ప్రేక్షకుల ఆదరణ పొందుతున్న 'ఈ నగరానికి ఏమైంది' (ఈఎన్ఈ) చిత్రానికి నివాళిగా 'ఈఎన్ఈ డే' వేడుకను ఘనంగా నిర్వహించారు. 'ఈఎన్ఈ రిపీట్' విడుదలకు ముందు నిర్వహించిన ఈ కార్యక్రమంలో దర్శకుడు తరుణ్ భాస్కర్, నటీనటులు అభిమానులతో కలిసి రోజంతా సందడి చేశారు. సాధారణ సినిమా ప్రచార కార్యక్రమాలకు భిన్నంగా 'ఈఎన్ఈ గాట్ లేటెంట్', ప్యానల్ చర్చలు, 'ఉమెన్ ఇన్ సినిమా'పై ప్రత్యేక సంభాషణలు, లఘుచిత్రాల ప్రదర్శనలు నిర్వహించారు. తరుణ్ భాస్కర్‌తో పాటు చిత్రబృందం అభిమానులతో ముచ్చటించి అనుభవాలను పంచుకుంది. 2018లో విడుదలైన ఈ చిత్రం స్నేహం, హాస్యం, ఆకట్టుకునే పాత్రలతో కల్ట్ ఫిల్మ్‌గా గుర్తింపు పొందింది. మీమ్స్, రీవాచెస్, సోషల్ మీడియా ద్వారా ఇప్పటికీ అభిమానుల ఆదరణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో అభిమానులనే వేడుకలో భాగస్వాములుగా చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విశ్వక్ సేన్, అభినవ్ గోమఠం, శ్రీనాథ్ మాగంటి, వెంకటేశ్ కాకుమాను, శివాత్మిక రాజశేఖర్, అనీషా అంబ్రోస్ నటించిన 'ఈఎన్ఈ రిపీట్' నవంబర్ 19న ప్రేక్షకుల ముందుకు రానుంది.



బాలలే దేశ భవిష్యత్తుకు పునాదులు

వారి కలలను సాకారం చేయడమే మా లక్ష్యం: గుజ్జ సత్యం

విశ్వంభర ,పెద్దఅంబర్‌పేట: సత్యం టెక్నో స్కూల్, పెద్దఅంబర్‌పేటలో నవంబర్ 14న బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం విద్యార్థుల ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు, ఉత్సాహభరిత కార్యక్రమాలతో సందడిగా మారింది. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ గుజ్జ సత్యం మాట్లాడుతూ, పిల్లలే దేశ భవిష్యత్తుకు పునాదులని, నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలు, వైద్యులు, ఇంజినీర్లు, ఉన్నతాధికారులు, నాయకులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. పేదరికం, ఆర్థిక పరిస్థితులు, ప్రస్తుత అపకాశాల కొరత ఎవరి భవిష్యత్తుకూ శాశ్వత అడ్డంకులు కావని, పట్టుదల, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం ఉంటే ఎవరైనా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. విద్యార్థులు కేవలం పరీక్షల్లో మంచి మార్కులు సాధించడమే కాకుండా, మంచి వ్యక్తిత్వం, మానవీయ విలువలు, సేవాభావం పెంపొందించుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ , డైరెక్టర్ అరవింద్ బాబు మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సృజనాత్మకత, కమ్యూనికేషన్ నైపుణ్యాలు ఎంతో అవసర మని అన్నారు. ప్రతి విద్యార్థిలోనూ ప్రత్యేక మైన ప్రతిభ ఉంటుందని, ఉపాధ్యాయులు ఆ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు.



కాస్మోపాలిటన్ రియల్ ఎస్టేట్ డెవలపర్ అవార్డు అందుకున్న రమేష్ నాయుడు

విశ్వంభర , హైదరాబాద్: వ్యాపార రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధిస్తూ ముందుకు సాగుతున్న వరుణ్ డెవలపర్స్ యజమాని రమేష్ నాయుడు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. మలేషియాలోని కౌలాలంపూర్ నగరంలో ప్రతిష్టాత్మక రిట్జ్ కార్ల్టన్ హోటల్ వేదికగా నిర్వహించిన గ్లోబల్ ప్రైవేట్ జియస్ వరల్డ్ స్కూల్ సమ్మిట్ - క్లస్టర్ ఆఫ్ అచీవర్స్ కార్యక్రమంలో ఆయనకు ఈ ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా వరుణ్ డెవలపర్స్‌కు కాస్మోపాలిటన్ రియల్ ఎస్టేట్ డెవలపర్ అవార్డును ప్రముఖ సినీ నటి రకుల్ ప్రీత్ సింగ్ చేతుల మీదుగా అందజేశారు .ఈ గుర్తింపు ఆయన వ్యాపార ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. అంతర్జాతీయ వేదికపై వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల సమక్షంలో అవార్డు అందుకోవడం ఆయనకు, ఆయన సంస్థకు గర్వకారణంగా మారింది. రియల్ ఎస్టేట్ రంగంలో అభివృద్ధి సాధించాలంటే కేవలం వ్యాపార దృక్పథమే కాకుండా నాణ్యత, నమ్మకం, పారదర్శకత, వినియోగదారుల అవసరాలపై అవగాహన ఎంతో అవసరం. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన ఆలోచనలతో ముందుకు సాగుతూ, ఈ రంగంలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకోవడం ప్రతి సంస్థకు ఎంతో కీలకం. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన వ్యక్తులు, సంస్థలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే లక్ష్యంతో పరల్డ్ స్కూల్ సమ్మిట్ - క్లస్టర్ ఆఫ్ అచీవర్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్య, వ్యాపారం, రియల్ ఎస్టేట్ తదితర రంగాలకు చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ రంగాల్లో తమ కృషితో ప్రత్యేక స్థానం సంపాదించిన వారిని గుర్తించి సత్కరించడం ఈ కార్యక్రమం ప్రత్యేకతగా నిలిచింది.



హైదరాబాద్‌లో భారీ అగ్ని ప్రమాదం.. దగ్ధమైన ట్రావెల్స్ బస్సులు

విశ్వంభర, కుత్బుల్లాపూర్: నగరంలోని దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. బౌరంపేట బొడ్రాయి సమీపంలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు పార్కింగ్ యార్డులో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇప్పటికే రెండు బస్సులు పూర్తిగా దగ్ధమయ్యాయి. మరో రెండు బస్సులు తగలబడుతున్నట్లు సమాచారం. బస్సులు పక్కపక్కనే పార్క్ చేసి ఉండటం వల్ల మంటలు పక్కనే ఉన్న బస్సులకూ వ్యాపించాయి. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.





ఆర్.కె.పురం భాష్యం పాఠశాలలో అంబరాన్నంటిన బాలల దినోత్సవ వేడుకలు

విశ్వంభర, సరూర్ నగర్ : ఆర్.కె.పురం భాష్యం పాఠశాలలో బాలలదినోత్సవ వేడుకలు అంబరాన్నంటేవిధంగా నిర్వహించబడినవి. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చైర్మన్ భాష్యం రామకృష్ణ,సి.ఇ.ఒ చైతన్య, యల్.బి.నగర్ జోన్ జడ్.ఇ.ఒ. అంకమ్మరావు,ప్రిన్సిపాల్ అప్పారావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్య క్రమాన్ని ఘనంగా ప్రారంభించినారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అంకమ్మరావు మాట్లాడుతూ బాలల దినోత్సవం ప్రత్యేకతను గురించి, అలాగే విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలకు, ఆటపాటకు ప్రాముఖ్యత ఇచ్చి వారిని అన్ని విధాల తీర్చిదిద్దుతామన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ అప్పారావు మాట్లాడుతూ ఇప్పటి నుండి 10వ తరగతి వార్షిక పరీక్షలకు విద్యార్థులు ఎలా ప్రిపేర్ అవ్వాలో వివరించినారు. విద్యార్థులు కూచిపూడి, భరతనాట్యం, జానపద, నెప్సన్ డాన్స్ లతో కార్యక్రమాన్ని అలరించారు. ఈ కార్యక్రమంలో లిటిల్ ఛాంప్స్ ప్రిన్సిపాల్ ప్రేతాసునిల్ పాల్గొన్నారు.

గ్యారంటీలు, డిక్లరేషన్లపై రాహుల్ సమాధానం చెప్పాలి: కేటీఆర్



విశ్వంభర, హైదరాబాద్: ఆరు గ్యారంటీలు, 420 హామీలు, 13 డిక్లరేషన్లపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా రాహుల్‌గాంధీపై ఆయన విమర్శలు గుప్పించారు. ''కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టో 'అభయ హస్తం' పచ్చి అబద్ధం. బీసీలకు రూ.లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చి మూడేళ్లలో రూ.5వేల కోట్లలోపే ఖర్చు చేశారు. బీసీలకు విద్య, ఉద్యోగాలు, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో 42 శాతం వాటా హామీ ఇచ్చారు. అమలు చేసింది జీరో. పేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.12 లక్షల అంబేడ్కర్ అభయహస్తం పథకం హామీలో అమలు జీరో. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ఎస్సీ, ఎస్టీలకు 31 శాతం వాటా హామీ ఏమైంది? 365 రోజుల్లో 2 లక్షల ఉద్యోగాల హామీకి.. ఇచ్చిన కొలువులు కేవలం 10 వేలు మాత్రమే. విద్యార్థులకు రూ.5లక్షల విద్యా భరోసా కార్డు హామీకి..అమలు చేసింది జీరో. మైనార్టీలకు రూ.4 వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చి రూ.వెయ్యి కోట్లలోపే ఇచ్చారు. తెలంగాణకు కాంగ్రెస్ చేసిన ద్రోహానికి అంతు లేదు'' అని కేటీఆర్ పేర్కొన్నారు.

రిపోర్టర్లు కావలెను
V3 NEWS
ప్రజా విశ్వంభర
"విశ్వంభర"
తెలుగు దిన పత్రిక
ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.
సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి x రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.
సెల్: 9441222429, 8885402108